ఎమెస్కో

# బ్రతుకు బొంగరం

రావులపాటి సీతారాంరావు

ఎమెస్కో

# బ్రతుకు బొంగరం

"వీణా! నీవు వట్టి మూగబోయిన వీణవేనా?

నీకు మాటలు రావా? చెప్పు, చెప్పు. అదంతా అబద్ధమని, నీ వందరిలాగానే మాట్లాడగలవని చెప్పు! చెప్పు వీణా! రవిచంద్ర ఆమెను ఆవేశంతో ఊపుతూ అరిచాడు.

కాని వీణ మాట్లాడలేదు. ఇప్పుడేకాదు, పుట్టినప్పటినించి జీవితంలో ఎప్పుడూ ఇంతవరకు మాట్లాడలేదు. విధాత ఆమెకు గొంతు ఇవ్వకుండా గొంతు కోశాడు. అందమైన వీణను సృష్టించి స్వరాలు బిగించడం మరిచిపోయాడు.

కుంగిపోతూ ఆమె భూమిలో తల దూర్చింది. అందరి జీవితాల్లోనూ వచ్చే అపూర్వమైన ఈ ఘట్టం కోసం అందరిలాగే తాను ఎదురుచూసింది. అయితే అందరికీ, తనకు భేదం ఉంది, అందరిలా తను ఆనందంతో కాదు భయంతో, ఆవేశంతోకాదు ఆవేదనతో, అనుభవంకోసం ఎదురుచూసే అనుభూతితో కాదు గుండెల్లో అన్ని ఏళ్లనించి పేరుకొనిపోయిన విషాదంతోనే ఎదురుచూసింది.

"మాట్లాడు, వీణా, నీవు మూగదానవు కావని చెప్పు." రవిచంద్ర పిచ్చిగా ఆమె ముఖంలో ముఖం పెట్టి అరిచాడు. అతనిప్పుడు చిరునవ్వుతో చిలిపిగా కబుర్లు చెప్పే రవిచంద్ర కాదు. నిజమా, అబద్ధమా? తేల్చుకోలేక త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడుతున్న సంశయాత్ముడు. తాను కన్న బంగారు కలలన్ని ధ్వంసమయిపోతవేమోనని, తన జీవితం పండిన కల అనుకున్న తన అనుభూతి విచ్ఛిన్నమై పోతుందేమోనని, కుంగిపోతున్న రవిచంద్ర.

ఆమె కన్నులు టపటప కొట్టుకున్నాయి. గాజు ఒకటి గలగలమని టప్పున విరిగి పోయింది అతని తాకిడికి.

రవిచంద్రకు కోపము, ఆవేశము, నిస్సహాయత, లోకంలో అందరిమీద కసి–అన్నీ ఒక్కసారిగా వచ్చాయి. ఆమెవేపు భయంకరంగా చూస్తూ, "నా గుండె బద్దలు చేయబోకు! నా జీవితం నాశనం చేయబోకు! ఇది నిజమైతే భరించలేను. ఏమిటిది?" అన్నాడు.

ఆమెకు ఉప్పెనలా దుఃఖం వచ్చింది. ఎలా తను చెప్పాలి? తనకు తన భావాలను వెలిబుచ్చే ఆయుధాన్ని భగవంతుడివ్వటం మరిచిపోయాడని ఎలా చెప్పాలి? తను మూగదాన్నని, తనకు మాటలు రావని ఎలా... ఎలా చెప్పాలి?

కొన్ని క్షణాలు గదిలో నిశ్శబ్దం విషాదం రూపంలో ప్రవహించింది.

రవిచంద్ర అలసిపోయాడు. ఆత్రతతో చూసిన రాత్రి ఇలా అవుతుందని భావించకపోవడంవల్ల ఆఘాతం తిన్నట్టయ్యాడు. మెల్లిగా వెళ్లి కిటికీరెక్కలు తెరిచాడు. చల్లటి గాలి ముఖాన్ని కౌగిలించుకుంది.

వెనక్కి తిరిగి ఆమెను చూశాడు. పందిరిమంచం మీద ఆమె ఏడుస్తూంది శోకదేవతలా! గదిలో అగరువత్తులు సువాసనలు విరజిమ్మడం మానేశాయి. అక్కడ పెట్టిన ప్రతి వస్తువు, ప్రతి అలంకారము ఏదో భయంకర సంఘటనకు దారి తీస్తున్నట్టు అనిపించింది.

రవిచంద్ర తనను తాను నిగ్రహించుకొని మెల్లగా ఆమెవద్దకు వెళ్లి ఆ అందమైన ముఖాన్ని రెండు చేతులలోకి తీసుకొని, "వీణా!" అన్నాడు.

ఆమె నిస్సహాయంగా చూసింది. ఆమె కళ్లు వర్షిస్తున్నాయి.

"నన్నిలా ఏడిపించకు. నాతో మాట్లాడు. మాట్లాడు, వీణా!"

ఆమె కళ్లు అతన్ని చూడడం మానేశాయి.

"నీకు మాటలు రావా? నీవు మూగదానివా?"

ఆమె నీరసించినట్లు అతని చేతుల్లోంచి తూలి పడబోయింది. అతను వదల్లేదు. గట్టిగా పట్టుకొని "చెప్పు!" అన్నాడు.

ఆమె తనను తాను కూడదీసుకుంది. నెమ్మదిగా ఒకసారి రవిచంద్రను పరకాయించి చూసి తల ఊపింది.

అతను గుండె పట్టుకున్నట్లయి పిచ్చికోపంతో ఆమెను ఊపుతూ, "నిజంగా?" అని అరిచాడు.

'నిజం!' అన్నట్లు ఆమె తల ఊపింది. అంతే! రవిచంద్రకు ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. ఆమెను అప్రయత్నంగా వదిలేశాడు. గభాల్న ఆమె అతని కాళ్లమీద పడింది. అతనికి ఆమెను చూసే ఓపిక లేదు. మెదడులో తీవ్ర సంచలనం చెలరేగింది. తన ఆశలు, ఆశయాలు అన్నీ ధ్వంసమైనట్లు, తన బంగారు స్వప్నాలు తునాతునకలయినట్లు, తన జీవితకథ ఏదో విపరీతమైన మలుపు తిరిగినట్లు అతను వాపోయాడు.

రవిచంద్ర తడబడుతున్న అడుగులతో శోభనపు గదితలుపులు తెరవడంతో వీణ గుండెల్లో కూడా చీకటితలుపులు భళ్లున తెరుచుకున్నాయి.

చీకటిలో నడవబోయాడు.

ఎవరో దగ్గారు. అతను అప్రయత్నంగా ఆగాడు. వచ్చిన ఆయన బాల్కనీలోని లైట్లు వేశాడు. ఆయన వీణ తండ్రి అనంతంగారు.

రవిచంద్ర చీత్కారంతో ఆయన్ని చూశాడు.

ఆయన భయంభయంగా రవిచంద్రదగ్గిరికి వచ్చి చేతులు పట్టుకోబోయాడు. రవిచంద్రకు జెర్రెలు పాకినట్లనిపించింది. విదిలించుకున్నాడు.

"నన్ను... క్షమించు" అనంతంగారికి మాటలు దొరకడంలేదు.

"దేనికి?" ఛర్రున అడిగాడు రవిచంద్ర.

"నేను అన్యాయం చేశాను."

"ఎవరికి?" అన్నాడు.

"నన్ను కుంగదీయకు, నాయనా. చచ్చిన పాముని!"

"నేనా? మిమ్మల్ని కుంగదీయడమా? మనుషుల్ని కుంగదీసే నేర్పు నాకు లేదు. తెల్లనివన్ని పాలనుకుని నమ్మాను. మోసపోయాను."

"అలా మాట్లాడకు, రవీ. నీకేం మోసం జరగలేదు. వీణ మంచిపిల్ల. మాట తక్కువేగాని, మర్యాద మన్నన..."

"అనంతంగారూ!" బంగళా వణికిపోయింది. "నే నేమీ వినదలుచుకోలేదు! నన్ను విసిగించకండి. గుండెల్ని పిండిచేసే విద్యలో మీరు ప్రవీణులని నాకు బాగా తెలుసు. నన్ను కాస్సేపు ఒంటరిగా ఊపిరి పీల్చుకోనివ్వండి."